తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
జనంసాక్షి
www.janamsakshi.org
మెదక్ - మహబూబ్‌నగర్
సంగారెడ్డి | సిద్దిపేట
జోగులాంబ గద్వాల | వనపర్తి | నారాయణపేట | నాగర్ కర్నూల్
శుక్రవారం
05, జూన్, 2026

# సీఎం రేవంత్ రెడ్డి జడ్చర్ల పర్యటన..

## మహర్దశ పట్టేనా..

**- నేటి సమావేశంపైనే నియోజకవర్గ ప్రజల కళ్లు**



**జడ్చర్ల, జూన్ 4 (జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నేటి జడ్చర్ల పట్టణ పర్యటన ఖరారు కావడంతో నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజల్లో సరికొత్త ఆశలు చిగురిస్తున్నాయి. వేగంగా విస్తరిస్తూ, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోనే కీలక వాణిజ్య కేంద్రంగా ఎదుగుతున్న జడ్చర్ల పట్టణ సమగ్ర అభివృద్ధికి ఈ పర్యటన ఒక మైలురాయిగా మారుతుందని స్థానికులు భావిస్తున్నారు. ముఖ్యమంత్రి పర్యటనను పురస్కరించుకుని పట్టణంలోని దీర్ఘకాలిక సమస్యలకు పరిష్కారం లభిస్తుందని, సీఎం రేవంత్ రెడ్డి స్పష్టమైన హామీలతో పాటు నిధుల వరాలు కురిపిస్తారని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

**చిగురిస్తున్న నిర్వాసితుల ఆశలు:** ఉదండాపూర్ రిజర్వాయర్ నిర్వాసిత గ్రామాల ప్రజలు కొన్నేళ్లుగా తమ సమస్యల పరిష్కారం కోసం ఎంతో ఆవేదనతో ఎదురుచూస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రాజెక్టు పరిశీలనకు రానుండటంతో నిర్వాసితుల్లో మళ్లీ ఆశలు చిగురిస్తున్నాయి. స్థానిక ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు.. ఇప్పుడు సీఎం పర్యటన ద్వారా ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ డబ్బులు చెల్లించడంతో పాటు, ఇళ్ల స్థలాల సమస్య పూర్తిగా పరిష్కారమవుతుందని బాధితులు ఎంతో నమ్మకంతో ఆశిస్తున్నారు.

**రింగ్ రోడ్ నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ వచ్చేనా..** రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీ జడ్చర్ల ప్రజలను తీవ్రంగా వేధిస్తోంది. జాతీయ రహదారిని ఆనుకుని ఉండటం, పారిశ్రామికంగా, వ్యాపారపరంగా లావాదేవీలు పెరగడంతో పట్టణంలో వాహనాల రాకపోకలు విపరీతంగా పెరిగాయి. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారంగా 'రింగ్ రోడ్' నిర్మాణానికి ప్రభుత్వం ఎప్పుడు గ్రీన్ సిగ్నల్ ఇస్తుందో, అవసరమైన నిధులను ఎప్పుడు మంజూరు చేస్తుందో అని స్థానికులు ఎంతో ఉత్కంఠతో ఎదురుచూస్తున్నారు. ముఖ్యమంత్రి ఈ పర్యటనలోనే రింగ్ రోడ్ ప్రాజెక్టుపై అధికారిక ప్రకటన చేయాలని కోరుతున్నారు.

**శాంతి భద్రతల పరిరక్షణకు ప్రత్యేక పోలీస్ స్టేషన్:** పట్టణ విస్తరణ వేగంగా జరుగుతున్న నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణకు, ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక పోలీస్ స్టేషన్ల ఏర్పాటు అత్యవసరంగా మారింది. జనాభా అవసరాలకు అనుగుణంగా జడ్చర్లకు ప్రత్యేక 'టౌన్ పోలీస్ స్టేషన్' తో పాటు, నిత్యం జరిగే ట్రాఫిక్ ఇబ్బందులను అధిగమించడానికి, ప్రమాదాల నివారణకు ప్రత్యేక 'ట్రాఫిక్ పోలీస్ స్టేషన్' ను ఏర్పాటు చేయాలని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

**బస్సు డిపోపై ప్రయాణికుల భారీ ఆశలు:** నిత్యం వేలాది మంది ప్రయాణికులు, విద్యార్థులు, ఐటీఐ, డిగ్రీ కళాశాలల విద్యార్థులు వివిధ ప్రాంతాల నుండి జడ్చర్లకు రాకపోకలు సాగిస్తుంటారు. పెరుగుతున్న ప్రయాణికుల అవసరాల దృష్ట్యా జడ్చర్లకు ప్రత్యేకంగా ఒక 'బస్సు డిపో' ఏర్పాటు చేసి, చుట్టుపక్కల ఉన్న గ్రామీణ ప్రాంతాలకు కొత్త ఆర్టీసీ సర్వీసులను అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

**సీఎం వరాల కోసం ఎదురుచూపులు:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జడ్చర్ల భవిష్యత్ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని, నేటి సమావేశంలో ఈ ప్రధాన సమస్యలపై సానుకూలంగా స్పందించి, రింగ్ రోడ్, పోలీస్ స్టేషన్లు, బస్సు డిపో ఏర్పాటుపై స్పష్టమైన హామీలు ఇవ్వాలని జడ్చర్ల నియోజకవర్గ ప్రజలు ఎంతో ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. ముఖ్యమంత్రి పర్యటనతో జడ్చర్ల భవిష్యత్తుకు సరికొత్త దిశానిర్దేశం లభిస్తుందో లేదో చూడాలి.

# రైతులు అధైర్య పడొద్దు ధాన్యం చివరి గింజ వరకూ కొంటాం

**- 200 ధాన్యం కొనుగోలు కేంద్రాలు మూసివేత**
**- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**



**మెదక్ జిల్లా బ్యూరో చీఫ్, జూన్ 4 (జనంసాక్షి):** రైతులు అధైర్య పడోద్దని ధాన్యాన్ని చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. గురువారం కలెక్టరేట్ మీటింగ్ హాల్ నుంచి అధికారులతో గూగుల్ మీట్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ.. ధాన్యం చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని, రైతులు అధైర్య పడొద్దు అన్నారు.

ఈ రోజు వరకు 71,327 మంది రైతుల నుంచి 3,50,620.680 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి, 57,496 మంది రైతుల లకు రూపాయలు 616.93 కోట్ల రూపాయల చెల్లింపులు జరిగాయన్నారు. 200 ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొనుగోళ్లు పూర్తిచేసి కేంద్రాలను ముసివేయడం జరిగిందనీ,

ధాన్యం కొనుగోలు పూర్తి అయిన కేంద్రాల్లోని హమాలి , లారీలను ధాన్యం పూర్తి కానీ కేంద్రాలకు తరలించి వేగంగా అన్లోడింగ్ జరపాలన్నారు.

ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి దేవకుమార్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీనివాసరావు, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి నిత్యానంద తదితరులు పాల్గొన్నారు.

# డాక్టర్ గీతను అభినందించిన టిపిసిసి రాష్ట్ర అధ్యక్షులు

**- వైద్యులు దైవ సమానులు, సమాజంలో పేదలకు మెరుగైన వైద్య సేవాలు అందించాలి....**



**నారాయణపేట జూన్ 4 (జనంసాక్షి):**
కాంగ్రెస్ పార్టీ డాక్టర్ సెల్ ను ఏర్పాటు చేయడం అభినంద నీయమని పార్టీ కోసం తమ సమయాన్ని కేటాయించడం డాక్టర్ల నిబద్ధతకు నిదర్శనమని సమాజంలోని పేద ప్రజలకు వైద్య సేవాలు అందించేందుకు నిష్ణాతులైన వైద్యులను జిల్లాల వారిగా చేర్మెన్‌లను నియమించడం గర్వకారణమని టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ అన్నారు, హైదరాబాద్ గాంధీ భవన్‌లో నిర్వహించిన డాక్టర్ సెల్ సమావేశంలో అయన మాట్లాడుతు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నెత్రుత్వంలో వైద్యం విద్య వ్యవసాయ రంగాలకు ప్రభుత్వం ప్రాదాన్య మిస్తుందని 6లక్షల కోట్ల అప్పులు ఉన్న రాష్ట్ర అభివృద్ధి సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం ముందు కెళ్లుతుందోన్నారు డాక్టర్ సెల్ ఆధ్వర్యంలో తమ తమ జిల్లా లోని సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించి వైద్యసేవాలు అందించేందుకు కృషిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పేట జిల్లా కాంగ్రెస్ డాక్టర్ సెల్ అధ్యక్షురాలుగా నియమితులైన డాక్టర్ గీతకు పూల బొకే నందించి అభినందించారు

# మక్తల్ నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకం ద్వారా లక్ష ఎకరాలకు సాగునీరు

**- ఎత్తిపోతల పథకం పనులను పరిశీలించిన ముఖ్యమంత్రి**
**- ప్రాజెక్టుల పురోగతిపై అధికారులతో సమీక్ష**

**మక్తల్, జూన్ 04 (జనంసాక్షి):** మక్తల్ నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకం ద్వారా లక్ష ఎకరాలకు సాగునీరు అందుతుందని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి తెలిపారు. కృష్ణా, భీమా నదులపై నిర్మించనున్న ప్రాజెక్టు పనుల పురోగతిపై గురువారం ముఖ్యమంత్రి బెంగుళూరు నుంచి నేరుగా మక్తల్ చేరుకున్నారు. ప్రత్యేక హెలికాప్టర్‌లో వచ్చిన ముఖ్యమంత్రికి రాష్ట్ర మంత్రులు డాక్టర్ వాకిటి శ్రీహరి, జూపల్లి కృష్ణారావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి ఘన స్వాగతం పలికారు. అనంతరం మఖ్తల్ నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకం భీమా కృష్ణా నదులపై ప్రతిపాద బ్యారేజీ పనులు పురోగతికి సంబంధించిన ఫోటో ఎగ్జిబిషన్ ప్లాన్ మ్యాప్స్ ద్వారా ముఖ్యమంత్రికి ఇరిగేషన్ అధికారులు వివరించారు. అనంతరం మక్తల్ నారాయణపేట కొడంగల్





ఎత్తిపోతల పథకంలో భాగంగా కాట్రపల్లి గ్రామం వద్ద నిర్మాణంలో ఉన్న పంప్‌హౌస్ పనులను సీఎం రేవంత్ రెడ్డి పరిశీలించారు. ప్రాజెక్టు పురోగతి, నిర్మాణ పనుల స్థితిగతులను మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి వివరించారు. పాలమూరు ప్రాంతానికి సాగునీరు అందించాలనే లక్ష్యంతో చేపట్టిన ప్రాజెక్టుల పురోగతిపై సీఎం ప్రత్యేకంగా ఆరా తీశారు. పనులు వేగంగా, నాణ్యతతో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

అంతకుముందు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన సందర్భంగా బందోబస్తు ఏర్పాట్లను జోగులాంబ జోన్ డిఐజి  చౌహాన్, జిల్లా ఎస్పీ డా. వినీత్ పరిశీలించారు. పోలీసు అధికారులు, సిబ్బందికి భద్రతా పరమైన సూచనలు చేశారు. అనంతరం ముఖ్యమంత్రికి పూలమొక్క అందించి మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్





కుమార్ రెడ్డి, కర్ణాటక రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి బోసు రాజు, జిల్లా మంత్రులు జూపల్లి కృష్ణారావు, డాక్టర్ వాకిటి శ్రీహరి, జిల్లా కలెక్టర్ సీహెచ్ ప్రియాంక, ఇరిగేషన్ శాఖ కార్యదర్శి శ్రీధర్, చీఫ్ ఇంజనీర్ ఎ. సత్యనారాయణ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజనీర్ హెచ్.టి. శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచాలి

**- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**



**మెదక్ మే 4 (జనంసాక్షి):** ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులకు ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ లోని మీటింగ్ హాల్లో విద్యాధికారులతో సమీక్షించారు.

**ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ..** ఈ విద్యా సంవత్సరం మెరుగైన విద్యా ప్రమాణాల లక్ష్యంగా ముందుకు పోతూ బడి బాట సమర్థవంతంగా నిర్వహించాలని, విద్యార్థుల తక్కువ నమోదు పాఠశాలలపై ప్రత్యేక దృష్టి సారించాలని, విద్యార్థుల నమోదు పెంచుటకై గ్రామంలోని ప్రతి ఒక్కరిని భాగస్వాములు చేయాలని, కనీస సామర్థ్యాలు అయినటువంటి చదవడం రాయడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, పాఠశాలల్లో ఏర్పాటు చేసే మౌలిక వసతుల గురించి తల్లిదండ్రులకు వివరించాలని, వీటి ఆధారంగానే పాఠశాలలకు ప్రగతి సూచికలు ఇవ్వబడతాయని, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ప్రీ ప్రైమరీ పాఠశాలలపై ప్రత్యేకచర్యలు తీసుకోవాలని అలాగే ఎఫ్ఆర్ఎస్,ఇతర అంశాలపై దృష్టి పెట్టి సరియగు చర్యలు గైకొనాలని సూచించారు.

జిల్లాలోని భవిత కేంద్రాల బలోపేతానికి కృషి చేయాలని, కొత్త ప్రీ ప్రైమరీ విభాగాలను ప్రారంభించాలని, విద్యార్థుల సంఖ్యలేని పాఠశాలలను తిరిగి ప్రారంభించాలని, పాఠ్యపుస్తకాల పంపిణీ చేయాలని, స్వయం సహాయక బృందాల చేత పిల్లలకు యూనిఫామ్ కుట్టించాలని, నూతన టెక్నాలజీ ఏఐ, డిజిటల్ తరగతులను నిర్వహించాలని, విద్యాశాఖ బలోపేతానికి ప్రత్యేక కార్యచరణ ప్రకారం ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులకు ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి రాజు, చీఫ్ మానిటరింగ్ ఆఫీసర్ రాజు, ఏ ఎం ఓ సుదర్శన మూర్తి, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

# రేపు అక్కన్నపేట వన్‌యోజన పార్కులో ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలు

**- అటవీ శాఖ ఆధ్వర్యంలో 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక' కార్యాచరణ**

**- ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ప్రజాప్రతినిధులు, అధికారులు**



**మెదక్ జిల్లా బ్యూరో చీఫ్, జూన్ 4 (జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక' లో భాగంగా మెదక్ జిల్లాలో ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు. అటవీశాఖ ఆధ్వర్యంలో జూన్ 1 నుండి జూన్ 12 వరకు ప్రత్యేక పర్యావరణ ఇతివృత్త కార్యాచరణ ప్రణాళికను రూపొందించారు. ఇందులో భాగంగా జూన్ 5 (రేపు) ఉదయం 9:30 గంటలకు మెదక్ జిల్లాలోని అక్కన్నపేట నగర్ వన్ యోజన పార్క్ వేదికగా ఈ ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలు జరగనున్నాయి. ఈ పర్యావరణ మహోత్సవానికి జిల్లాలోని ప్రముఖ ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. పర్యావరణ పరిరక్షణ, అడవుల విస్తరణ, ప్రకృతి సమతుల్యతను కాపాడటంపై ఈ సందర్భంగా ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు, మొక్కలు నాటే కార్యక్రమాలను చేపట్టనున్నారనీ, మెదక్ జిల్లా అటవీ శాఖ అధికారి జోజి గురువారం ఒక ప్రకటనలో కోరారు.

# హవేలి ఘనపూర్ మండల కేంద్రంలో రైతుల ఏకగ్రీవ తీర్మానం



**మెదక్ మే 4 (జనంసాక్షి):** తెలంగాణ రక్షణ సమితి మెదక్ జిల్లా కమిటీ సభ్యులు ఈరోజు సమావేశం మెదక్ జిల్లా హవెలి ఘనపూర్ రైతుల సమస్యలకు ఏకగ్రీయ తీర్మానం మెదక్ జిల్లా అధ్యక్షులు అంతం గారి వెంకటేశం జిల్లా గౌరవ అధ్యక్షులు అక్క మొల్ల మైసయ్య యాదవ్ ఆధ్వర్యంలో జిల్లా కమిటీ సభ్యులు ముఖ్యఅతిథి రాష్ట్ర అధ్యక్షులు పాకాల శ్రీహరిరావు రాష్ట్రంలో మొట్టమొదటి మెదక్ జిల్లా హవెలి ఘనపూర్ మండల్ లో గురువారం ముఖ్యమైన అంశాలపై ఏకగ్రీవ తీర్మానం పెంచిన ఎరువుల ధర తగ్గించాలి రైతు పండించిన పంట మద్దతు పంట బీమా పథకం ప్రభుత్వం చెల్లించాలి పని ఉపాధి పథకం రైతులకు అనుసంధానం రైతుకు కాపు లోన్ వడ్డీ ప్రభుత్వమే చెల్లించాలి రైతు ప్రవేటు అప్పుల దారపోకుంట డ్వాక్రా మహిళలు లాగా ప్రభుత్వం రైతుకు లోను రెండు లక్షల వరకు ఇవ్వాలి రైతులు పండించే పంట అంచనా ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం రైతులను ఇబ్బంది పెట్టకుండా సర్వే ప్రకారం నెలలోపు ధాన్యాన్ని కొనుగోలు చేయాలి నెలలు గడిచిన పండించిన పంట రైతులతో కొనుగోలు చేయకపోవడం ఒకవైపు అకాల వర్షాలు ఇంటర్ నష్టాలు ప్రభుత్వం ఇచ్చిన హామీలు సకాలం చెల్లించకపోవడం రైతులకు భారీ ఎత్తు నష్టం జరగకుండా రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం రైతుల పైన దృష్టి సారించి చెల్లించాలి ఇది ఒక ఏకతీయ తీర్మానం జై కిసాన్ జై జై కిసాన్ జిల్లా ఉపాధ్యక్షులు అశోక్ రెడ్డి కార్యదర్శి నరేందర్ వర్కింగ్ ప్రెసిడెంట్ కొండ ఎల్లం యాదవ్ పర్సు యాదవ్ జిల్లా నాయకులు గ్రామ సర్పంచ్ సాయిలు, మాజీ సర్పంచ్ నోముల శ్రీకాంత్ ఉప సర్పంచ్ వాడు నెంబర్లు, శ్రీపాల్ ప్రతాపరెడ్డి గ్రామ రైతు నాయకులు పాల్గొన్నారు.

# నేడు డయల్ యువర్ నర్సాపూర్ ఎమ్మెల్యే కార్యక్రమం



**కొల్చారం, జూన్ 4(జనంసాక్షి):** నర్సాపూర్ నియోజకవర్గంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం నూతన కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. నర్సాపూర్ నియోజకవర్గంలో ఏ గ్రామంలో నైనా సమస్యలు ఉంటే వాటిని నేరుగా నేడు ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డికి యు డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమం నిర్వహించబడుచున్నందున మీ సమస్య-మా పరిష్కారం 70755 18752 నెంబర్‌కు నేరుగా మాట్లాడవచ్చునని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి తెలిపారు.

# మొక్కలు నాటే కార్యక్రమంలో యువత పాల్గొనాలి



**తూప్రాన్ జూన్ 4(జనంసాక్షి):** తూప్రాన్ మండలం మల్కాపూర్ ఆదర్శ గ్రామంలో ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక గ్రామ సభను ఏర్పాటు చేశారు. గ్రామసర్పంచ్ ఆంజనేయులు గౌడ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన గ్రామసభకు స్పెషల్ ఆఫీసర్ మధు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న వర్షాకాలంలో ప్రజలు తీసుకోవలసిన జాగ్రత్తల పైన అవగాహన కల్పించారు. తడి పొడి చెత్త సేకరణ, మంచినీటి సరఫరా,సేంద్రియ ఎరువుల తయారీ, పారిశుధ్యం పై చర్చించారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మొక్కలు నాటే కార్యక్రమంలో యువకులు చురుకుగా పాల్గొనాలని సూచించారు. గ్రామానికి ప్రీ ప్రైమరీ స్కూల్ మంజూరు కావడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఉపాధ్యాయులు కోరారు. దానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మహేశ్వరి, ఉప సర్పంచ్ స్వామీ, వార్డు సభ్యులు కృష్ణ, తిరుపతి, కృష్ణ ముదిరాజ్, వేణు, రేఖ, అంగన్వాడి టీచర్లు లావణ్య, స్వర్ణలత, ఆశ వర్కర్ ఇందిరా, మేకిన్ యువత, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య

**- ప్రత్యేక చర్యలు చేపట్టిన రాష్ట్ర ప్రభుత్వం**

**- రాంపూర్ సర్పంచ్ శెట్టె కొమురయ్య**

**- బడిబాట కార్యక్రమం చేపట్టిన ఉపాధ్యాయ బృందం**



**చేర్యాల, జూన్ 04 (జనంసాక్షి):** ప్రభుత్వ పాఠశాల్లోనే మెరుగైన విద్యతో పాటు విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నట్లు రాంపూర్ సర్పంచ్ శెట్టె కొమురయ్య తెలిపారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా గురువారం మండలంలోని రాంపూర్ గ్రామంలో ఆకునూరు జిల్లా పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాల (జడ్పిహెచ్ఎస్) పాఠశాల ఆధ్వర్యంలో ఇంటింటా తిరుగుతూ బడిబాట కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం అనేక సౌకర్యాలు కల్పిస్తోందని తెలిపారు. ప్రతి విద్యార్థికి మెరుగైన విద్య అందేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని అన్నారు. మధ్యాహ్న భోజనం, రెండు జతల దుస్తులు, కంప్యూటర్ క్లాసులు, ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, అర్హత కలిగిన ఉపాధ్యాయుల చేత చక్కటి బోధన లభిస్తుందని తెలిపారు. సకల సౌకర్యాలు కలిగిన ప్రభుత్వ పాఠశాలలో బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించి వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉప్పల ప్రభాకర్, బూరుగు సత్యనారాయణ గౌడ్, పోల వెంకటేశం, మంతపురి గణేష్, నందిని, వేణుగోపాల్, ఉప సర్పంచ్ నిమ్మ లక్ష్మారెడ్డి, గ్రామస్తులు రంగు రాజు, నిమ్మ రాజు, ఆకునూరు పూర్వ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# రైతుల కోసం జీలుగ విత్తనాలు: అగ్రికల్చర్ ఆఫీసర్ కృష్ణయ్య

అచ్చంపేట రూరల్ జూన్ 04(జనంసాక్షి) : వరి పంటను సాగుచేసే రైతులు జీలుగ విత్తనాలను వినియోగించడం వలన రసాయనాల ఎరువు వాడకం తగ్గించవచ్చని అచ్చంపేట మండల వ్యవసాయాధికారి కృష్ణయ్య కోరారు. గురువారం కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ జీలుగ విత్తనాలను ప్రభుత్వం 50శాతం సబ్సిడితో ఒక కిలో 85 చొప్పున 30కిలోల బస్తా ప్యాకింగ్గా అందిస్తుందని రెండున్నార ఎకరాలను సరిపోతుందన్నారు. జీలుగను పచ్చి ఎరువుగా ఉపయోగించడం వల్ల భూమిలో సేంద్రియ పదార్థం పెరుగి నేలసారవంతంగా మారుతుందన్నారు. అలాగే నత్రజని లభ్యత పెరిగి, రసాయానాల ఎరువులు తగ్గుతుందన్నారు. వరిపంట దిగుబడి,నేల ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు. ఆసక్తిగల రైతులు పిఏసిఎస్ కార్యాలయంలో అందుబాటులో ఉన్నాయన్నారు.

# ప్రజా పాలన - ప్రగతిప్రణాళిక వారోత్సవాలు

**- ఎంపీడీవో క్రాంతికుమార్**



**పెద్ద శంకరంపేట, జూన్ 4 (జనంసాక్షి):** మెదక్ జిల్లా, పెద్ద శంకరంపేట మండలం మక్తా లక్ష్మాపూర్ గ్రామంలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక గ్రామ సభ నిర్వహించబడింది.

గ్రామ సభలో వర్షాకాల సంసిద్ధత, తాగునీటి సరఫరా, గ్రామ పరిశుభ్రత, ఘన వ్యర్థాల నిర్వహణ, జల సంరక్షణ, హరితహారం, పల్లె ప్రగతి కార్యక్రమాల గ్రామాభివృద్ధికి సంబంధించిన ఇతర అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో క్రాంతి కుమార్ మాట్లాడుతూ 99 రోజుల ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమం ద్వారా గ్రామాల్లో మౌలిక సదుపాయాల మెరుగుదల, పరిశుభ్రత, పచ్చదనం, తాగునీటి సదుపాయాలు ప్రజల సమస్యపరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వబడుతుందని తెలిపారు. గ్రామ ప్రజలు కార్యక్రమంలో చురుకుగా పాల్గొని గ్రామాభివృద్ధికి సహకరించాలని కోరారు. గ్రామ ప్రజలు తెలియజేసిన సమస్యలు, సూచనలను నమోదు చేసి వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అకుల శ్రీనివాస్, ఏపీఓ సంతోష్ కుమార్, పంచాయతీ కార్యదర్శి రాజ్ కుమార్, వార్డు సభ్యులు, ప్రజాప్రతినిధులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# చేర్యాల మున్సిపాలిటీలో పారిశుద్ధ్య కార్యక్రమం



**చేర్యాల జూన్ 04, (జనంసాక్షి):** పట్టణ ప్రగతి–పట్టణ ప్రణాళికలో భాగంగా 99 రోజుల కార్యక్రమంలో భాగంగా గురువారం చేర్యాల మున్సిపాలిటీ పరిధిలో 1,2,5 వ వార్డుల్లో పారిశుద్ధ్య కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ నాగేందర్ మాట్లాడుతూ.. రోజుకు మూడు వార్డులలో శానిటేషన్ కార్యక్రమాలు చేయిస్తున్నామన్నారు. రాబోవు వర్షాకాలాని దృష్టి లో పెట్టుకొని, మోరీలు, రోడ్లు శుభ్రతతోపాటు ట్యాంకులు కడిగించడం ఇతర పాశుద్ధ్య కార్యక్రమాలను చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో మేనేజర్ ప్రభాకర్, సీనియర్ అసిస్టెంట్ కృష్ణ, సుల్తానా,కౌన్సిలర్లు, సిబ్బంది ప్రజలు, నాయకులు పాల్గొన్నారు.

# జనగణనను పకడ్బందీగా నిర్వహించాలి

## - జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్



**మెదక్ జిల్లా బ్యూరో చీఫ్, జూన్ 4 (జనంసాక్షి):** జనగణన కార్యక్రమాన్ని అధికారులు, సిబ్బంది సమన్వయంతో పకడ్బందీగా నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జనగణన అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా **కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ..** జనగణన దేశ అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనకు, సంక్షేమ పథకాల అమలుకు అత్యంత కీలకమైన ప్రక్రియ అని తెలిపారు. ప్రతి ఇంటిని సందర్శించి, ప్రజల వివరాలను కచ్చితంగా నమోదు చేయాలని సూచించారు. ఎలాంటి పొరపాట్లు లేకుండా పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జనగణన నిర్వహించాలన్నారు. జనగణన సిబ్బందికి అవసరమైన శిక్షణ, సామగ్రి అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు కూడా జనగణన సిబ్బందికి సహకరించి సరైన సమాచారాన్ని అందించాలని విజ్ఞప్తి చేశారు. జనగణన విజయవంతంగా నిర్వహించేందు కు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు, జనగణన సిబ్బంది పాల్గొన్నారు.

# బాచేపల్లి గ్రామంలో గ్రామ సభ నిర్వహించిన స్థానిక ఎంపీడీవో సంగ్రామ్



**నిజాంపేట్, జూన్4(జనంసాక్షి):** నిజాంపేట మండలంలోని బాచేపల్లి గ్రామపంచాయతీ పరిధిలో గురువారం రోజున గ్రామ సభ నిర్వహించిన స్థానిక ఎంపీడీవో సంగ్రామ్ ఆయన మాట్లాడుతూ పలు గ్రామ అభివృద్ధి కొరకు కృషి చేస్తామని స్థానిక సర్పంచ్ ఎన్నో పనులు అభివృద్ధికి నేను సేవలు అందిస్తున్నారని ఇలానే మరి ఎన్నో సేవా కార్యక్రమాలు చేయాలని అలానే సర్పంచ్ తనయుడు శ్రీకాంత్ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి మరి ఎన్నో సేవలు చేయాలని మా అభివృద్ధి ప్రజల అందరికీ చేకూరేలా చూసుకుంటామని గ్రామసభలో హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఉప సర్పంచ్ పెంటయ్య, ఆర్ ఐ జాన్సన్, పంచాయతీ కార్యదర్శి రమేష్ కుమార్, అంగన్వాడీ టీచర్లు ఆశవర్కర్లు గ్రామ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# తూప్రాన్ అక్షర స్కూల్లో పర్యావరణ దినోత్సవం




**తూప్రాన్ జూన్ 4 (జనంసాక్షి):** జూన్ 5 ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని తూప్రాన్ పట్టణంలోని అక్షర స్కూల్లో ఉపాధ్యాయినులు వినూత్న ప్రదర్శన చేపట్టారు. పర్యావరణ పరిరక్షణలో అందరూ భాగస్వామ్యం అవ్వాలని, పర్యావరణ హిత ధరిత్రియే పుడమి జనులకు రక్షయనే సందేశాలనిస్తూ పోస్టర్లను ప్రదర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ ఉదయశ్రీ మాట్లాడుతూ బాల్యం నుండే విద్యార్థులకు పర్యావరణం పట్ల అవగాహన కలిగించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.

# పరిసరాలన్నీ పరిశుభ్రంగా ఉంచాలని ప్రతిజ్ఞ

## - సర్పంచ్ నీరుడి తుల్చమ్మ బిక్షపతి



**నర్సాపూర్ జూన్ 4 (జనంసాక్షి):** పర్యావరణ పరిరక్షణలో అందరూ భాగస్వాములై సంరక్షించే బాధ్యత అందరిదని గ్రామ సర్పంచ్ నీరుడి తుల్చమ్మ బిక్షపతి అన్నారు. గురువారం అచ్చంపేట గ్రామంలో 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గ్రామ సర్పంచ్ నీరుడితుల్చమ్మ బిక్షపతి. ఆధ్వర్యంలో గ్రామ సభను నిర్వహించారు. అనంతరం పర్యావరణాన్ని సంరక్షించాలని పరిసరాలన్నీ పరిశుభ్రంగా ఉంచాలంటూ ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ పరిసరాలన్నీ పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. చెత్త చెదారాలు లేకుండా ప్రతి ఒక్కరు పరిశుభ్రం పాటించాలన్నారు.

ఈ సందర్భంగా పాల్గొన్న వివిధ శాఖల అధికారులు పర్యావరణం తాగునీటి పరిసరాల శుభ్రత క్లుప్తంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ అంజిరెడ్డి.ఫారెస్ట్ అధికారులు సిద్ధం సింగ్, గ్రామ కార్యదర్శి శ్రావణి సింధుజ. ఉప సర్పంచ్ నవీన్,వార్డు సభ్యులు ప్రవీణ్, ఆంజనేయులు, కృష్ణ, లక్ష్మి,నర్సమ్మ పార్వతమ్మ, గ్రామ పెద్దలు.తదితరులు పాల్గొన్నారు.

# అందుబాటులో జనుము, జిలుగు, జిప్సం


## - మండల వ్యవసాయ అధికారి దీపిక



**నర్సాపూర్ జూన్ 4 (జనంసాక్షి):** నర్సాపూర్ మండలంలో పచ్చిరొట్టె జనుము, జిలుగు, విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు గురువారం మండల వ్యవసాయ అధికారి దీపిక తెలిపారు. జనుము, 40 కిలోల బస్తా రూ, 3,110 జిలుగు 30 కిలోల బస్తా రూ, 2452.50గా ఉందని ఒక బస్తా 2.5 ఎకరాలకు సరిపోతుందన్నారు. 90, శాతం సబ్సిడీపై జిప్సం కూడా అందుబాటులో ఉందని ఒక మెట్రిక్ టన్ను రూ, 534 గా ఉందన్నారు. కావలసిన రైతులు హెచ్, ఏ,సి,ఏ, లిమిటెడ్ పై డిడి తీసి దరఖాస్తును వ్యవసాయ శాఖ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. అవసరమైన రైతులు ఆధార్ కార్డు పట్టపాస్ బుక్‌తో వ్యవసాయ కార్యాలయాన్ని సంప్రదించి విత్తనాలను కొనుగోలు చేయాలని సూచించారు.

# వ్యక్తి అదృశ్యం

## - కుమారుడు శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు



**రేవల్లి, జూన్ 04 (జనంసాక్షి):** వ్యక్తి అదృశ్యమైన ఘటన గోపాల్ పేట మండలంలోని ఏదుట్ల గ్రామంలో చోటుచేసుకుంది. స్థానిక ఎస్సై డి.శశిధర్ తెలిపిన వివరాల ప్రకారం గోపాల్పేట మండలంలోని ఏదుట్ల గ్రామానికి చెందిన దొబ్బల శాంతయ్య తండ్రి లేట్ సాయిలు (58), కులం: మాదిగ, వృత్తి: వ్యవసాయం, తేది 19.05.2026 నుండి కనబడుట లేదని అతని కుమారుడు దొబ్బల శ్రీనివాసులు ఫిర్యాదు మేరకు గోపాల్ పేట ఎస్సై డి.శశిధర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# ఘనంగా ఎస్పి బాలు జన్మదిన వేడుకలు



**నారాయణపేట జూన్ 4(జనంసాక్షి):** సంగీత ప్రపంచానికే స్వర నిఘంటు బాలుఅని నేటి కళాకారులకు స్ఫూర్తిదాయకమని 50 వేలకు పైగా దేశభక్తి అన్నమయ్య కీర్తనలతోపాటు భక్తి, సినీ పాటలను ఆలపించి పాడుత తీయాగ కార్యక్రమం ద్వారా ఎందరో కళాకారుల్లో దాగి ఉన్న కళను వెలిక్కి తీసి ప్రోత్సహించిన మహోన్నత గాయకుడు ఎస్పి బాలు ఫ్యాన్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు మహిపాల్ రెడ్డి అన్నారు గురువారం బాలకేంద్రంలో ఎస్పి బాలు 80 వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా అయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళ్ళర్పించి చిన్నారులకు పండ్లు పంపిణి చేశారు ఈ కార్యక్రమంలో గాయకులు బాలాజీ గౌడ్ సంగనర్సింహులు రామకృష్ణ కళ్యాణి వసంత్ జ్ఞానమృత పాల్గొన్నారు

# ఆర్థికసాయం అందజేసిన ఏడో వార్డు మెంబర్ యాదగిరి



**కొల్చారం, జూన్ 4,(జనంసాక్షి):** కొల్చారం మండలంలోని కొంగోడ్ గ్రామంలో ఏడవ వార్డులో మన్నే శంకరమ్మ కొద్దిరోజుల నుండి అనారోగ్యాంగా ఉంటూ 5 రోజుల క్రితం చనిపోవడం జరిగింది. కుటుంబపోషణ పరిస్థితి విషయం తెలుసుకున్న వార్డు మెంబర్ యాన్నారం యాదగిరి అంతక్రియల్లో పాల్గొని ఐదు రోజుల కార్యక్రమానికి తనవంతు సహాయంగా కుటుంబానికి 4000 రూపాయలు అందజేశారు. యన్నారం యాదగిరి మాట్లాడుతూ గ్రామంలో పేద ప్రజలకు చిన్న చిన్న అవసరాలు కష్టాలు వచ్చినప్పుడు నావంతు సహాయం అందిస్తానని అయన అన్నారు. ప్రజలందరు సస్యశామాల వాతావరమణంలో అందరు సుఖసంతోషాలతోఉండాలని భగవంతుణ్ణి ఎల్లపుడు తలుచుకుంటానని అయన అన్నారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ,అరుణ్, ఏగొండ రాజు, ధరణి రాజు, తుపాకుల అశోక్, తుపాకుల మల్లేశం, గుర్రాల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# నానో యూరియా వేసుకొని అధిక దిగుబడులు పొందండి

## - ఏడీఏ సంగీతలక్ష్మి



**మల్దకల్ జూన్ 4 (జనంసాక్షి):** మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో గురువారం ఏడిఏ మల్దకల్ స్పెషల్ ఆఫీసర్ సిహెచ్ సంగీతలక్ష్మి కేతి బచావో రైతు అవగాహన సదస్సులో మాట్లాడుతూ భూమి కలుషితం కాకుండా ఎరువులు కావాల్సిన మోతాదులో మాత్రమే వేసుకోవాలని ఆమె అన్నారు. ఇట్టి సమావేశంలో పచ్చిరొట్ట ఎరువు అయినా జీలుగా, జనుము, పిల్లిపెసర, వేసు కోవడం వల్ల భూమిలో సారం పెరుగుతుందని తెలిపారు.వానకాలంలో వాతా వరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రైతులు పంటలు ఎంపికలు జాగ్రత్తలు పాటించాలని ఏడిఏ సంగీత లక్ష్మి తెలిపారు.వాతావరణ శాఖ అంచనా ప్రకారం జిల్లాలో వర్షాలు సాధారణంగా కురిసే అవకాశం ఉన్నప్పటికీ జూలై ఆగస్టు నెలలో వర్షభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందన్నారు.రైతులు ముందస్తు ప్రణాళికతో సాగు చేపట్టాలని సూచించారు. తేలికపాటి భూముల్లో కంది పెసర మినుము పత్తి వంటి లోతైన వేర్లు కలిగిన తక్కువ వ్యవధి పంటలను సాగు చేయాలని ,నల్ల రేగడి భూముల్లో మొక్కజొన్న జొన్న పెసర మిరప వంటి పంటలు సాగు చేయాలని తెలిపారు. జూన్ లో వర్షాలు బాగా పడ్డాయని తొందరపడి పంటలు ఎంపిక చేయెుద్దన్నారు.వర్షధారా సమయంలో ఒక తడి అందించగల రైతులు మాత్రమే అధిక పెట్టుబడి పంటలను సాగుచేయాలని సూచించారు. నానో యూరియా గురించి మాట్లాడుతూ వరి సాగును తగ్గించి ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని సూచించారు. ఆయిల్‌ఫామ్ యొక్కసాగు సబ్సిడీ గురించి వివరించారు.ఈ సమావేశంలో తాసిల్దార్ ఝాన్సీరాణి, ఏఈఓ రాహుల్ పైలెట్, గ్రామ సర్పంచు చిట్టెమ్మ,వార్డు మెంబర్లు రైతులు పాల్గొన్నారు.

# ప్రత్యేక గ్రామసభల ద్వారా ప్రజా సమస్యలకు పరిష్కారం

**- జిల్లా అదనపు కలెక్టర్ నగేష్**



**మెదక్ జిల్లా బ్యూరో చీఫ్, జూన్ 4 (జనంసాక్షి):** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని శంకరంపేట ఆర్ మండలంలోని రుద్రారం గ్రామపంచాయతీలో నిర్వహించిన ప్రత్యేక గ్రామసభకు జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ హాజరై గ్రామస్థులతో సమావేశమయ్యారు. గ్రామ సర్పంచ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి, జిల్లా వ్యవసాయశాఖ అధికారి, హార్టికల్చర్ అధికారి, ఇతర జిల్లా, డివిజన్, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ.. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని గ్రామాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు.

మురికి కాలువలను శుభ్రపరచడం, పిచ్చి మొక్కలను తొలగించడం, తాగునీటి వనరులు, వాటర్ ట్యాంకులను పరిశుభ్రంగా ఉంచడం, వీధి దీపాల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. గ్రామాల్లో పరిశుభ్రత పాటించడం ద్వారా వ్యాధుల వ్యాప్తిని నివారించవచ్చని తెలిపారు. ఘన వ్యర్థాల నిర్వహణ రూల్స్-2026ను గ్రామపంచాయతీలు తప్పనిసరిగా అమలు చేయాలని అదనపు కలెక్టర్ పేర్కొన్నారు. తడి, పొడి, శానిటరీ, ప్రత్యేక వ్యర్థాలను వేర్వేరుగా సేకరించి నిర్వహించాలని సూచించారు. గ్రీన్ బుట్టలో తడి వ్యర్థాలు, బ్లూ బుట్టలో పొడి వ్యర్థాలు, రెడ్ బుట్టలో శానిటరీ వ్యర్థాలు, నల్ల రంగు బుట్టలో ప్రత్యేక వ్యర్థాలను వేరుచేసి గ్రామపంచాయతీకి అందించాలని ప్రజలకు సూచించారు. గ్రామసభలో తాగునీటి నిర్వహణ, వర్షపు నీటి సంరక్షణ, మొక్కల పెంపకం, పర్యావరణ పరిరక్షణ, విపత్తు నిర్వహణ, ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం (SIR-2026), పంటల మార్పిడి, బడిబాట కార్యక్రమం, ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక ప్రక్రియ తదితర అంశాలపై ఆయా శాఖల అధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంపునకు ప్రతి ఒక్కరూ సహకరించాలని, ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అదనపు కలెక్టర్ కోరారు. రైతులు సంప్రదాయ పంటలతో పాటు పంటల మార్పిడిని అలవాటు చేసుకొని ఆయిల్ పామ్ వంటి ప్రత్యామ్నాయ పంటలను సాగుచేయాలని సూచించారు. అర్హులైన లబ్ధిదారులను గ్రామసభల ద్వారా గుర్తించి ఇందిరమ్మ ఇళ్ల పథకానికి ప్రతిపాదనలు పంపాలని అధికారులకు ఆదేశించారు. గ్రామాభివృద్ధి, ప్రజా భాగస్వామ్యం, పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ లక్ష్యాలతో ప్రత్యేక గ్రామసభలను విజయవంతం చేయాలని అదనపు కలెక్టర్ పిలుపునిచ్చారు.

అనంతరం స్వచ్ఛత ప్రతిజ్ఞ చేసి, స్వచ్ఛత పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ గ్రామ సభలో గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీనివాస్ రావు, వ్యవసాయ అధికారి దేవకుమార్, హార్టికల్చర్ అధికారి ప్రతాప్ సింగ్ ,సర్పంచ్ సంతోష నవీన్ గ్రామస్తులు, పాల్గొన్నారు. అనంతరం స్వచ్ఛత ప్రతిజ్ఞ చేసి, స్వచ్ఛత పోస్టర్లను ఆవిష్కరించారు.

# పోతారం గౌతోజిగూడ కూచారం గ్రామాల్లో పలు అంశాలపై ప్రజలకు అవగాహన

**- గ్రామాల సంక్షేమంపై భవిష్యత్తు ప్రణాళికలు**
**- సభలో పాల్గొన్న సర్పంచులు పుట్ట వినోద్ మహేందర్, నాగరాజు, రఘు**
**- గ్రామసభల ద్వారా స్వచ్ఛభారత్‌పై దిశానిర్దేశం**




**మనోహరాబాద్ జూన్5 (జనంసాక్షి):** మండల పరిధిలోని పోతారం గౌతోజిగూడ కూచారం గ్రామాల్లో గ్రామ సభల్లో ప్రజలకు భవిష్యత్తు ప్రణాళికలు పలు అంశాలపై ప్రజలకు సుదీర్ఘంగా అవగాహన కల్పించారు. డిఎల్పిఓ యాదగిరి ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ గ్రామ ప్రజలకు పలు సూచనలు చేశారు. మానవ మనుగడకు సురక్షిత నీరు ప్రజలకు చాలా అత్యంత అవసరం త్రాగడానికి వంట చేసుకోవడానికి ఎలాంటి హానికరమైన రసాయనాలు లేకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి ఆరోగ్య పరిరక్షణలో భాగంగా కలుషితమైన నీరు తాగడం వలన టైఫాయిడ్ డమేరియా వ్యాధులు వస్తాయి సురక్షిత నీరు ఈ ప్రమాదాలు అన్నిటిని నివారిస్తుంది ప్రజలకు నీటి స్వచ్ఛత తప్పకుండా అవసరం నీటిలో హానికరమైన బ్యాక్టీరియా వైరస్లు పురుగు మందులు విషపూరిత రసాయనాలు వాడకూడదు ఘన వ్యర్థాల నిర్వహణలో తీసుకోవాల్సిన ముఖ్యమైన జాగ్రత్తలు తడిచెత్త పొడి చెత్తలను వేరు చేయాలి వేరు చేసిన చెత్తను గ్రామపంచాయతీ సిబ్బంది ప్రత్యేక వాహనాల ద్వారా. సేకరించి ప్రాసెసింగ్ కేంద్రాలకు రవాణా చేస్తారు మొక్కల పెంపకం ద్వారా కాలుష్య నివారణ పర్యావరణ సమతుల్యతను కాపాడవచ్చు గాలిలో కర్బనఉద్ధారాలను తగ్గించడం ఆహార భద్రత పండ్లు పూలు ఔషధ మొక్కలు కలపను అందించే చెట్లను పెంచడం భూసార సంరక్షణకు భూమి కోతలను అరికట్టడం అడవుల విస్తీర్ణం కూడా పెంచవచ్చు ప్రత్యేక సమగ్ర సవరణ ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటర్లుగా నమోదు చేయడం మరణించిన లక్కి పేర్లను తొలగించడం దీని యొక్క ముఖ్య ఉద్దేశం ఇంటింటి సర్వే ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల అభ్యంతరాలు క్లైమాక్స్ ఓటర్ల జాబితాపై రకరకాల సందేహాలు కొత్తగా పేరు చేర్చడానికి దరఖాస్తులు సమర్పించవచ్చును వర్షకాల సన్నద్ధతలో భాగంగా మందు జాగ్రత్తగా విపత్తు నిర్వహణ ఆరోగ్య రక్షణ వ్యవసాయం ఇండ్ల నిర్వహణ లోతట్టు ప్రాంతాల అప్రమత్తత వరదలు వచ్చే అవకాశం ఉన్న ప్రాంతాల్లో ముందస్తు చర్యలు తీసుకోవాలి తాగునీటి కాలుష్యం మురుగునీరు తాగునీరు కలవకుండా ప్రత్యేక గొట్టాలను ఎప్పటికప్పుడు సరిచూసుకోవాలి రైతులు విద్యుత్ భద్రతపై ప్రత్యేక శ్రద్ధ ఉండాలి. వర్షాలు పడుతున్నప్పుడు విద్యుత్ స్తంభాలు ట్రాన్స్ఫార్మర్ల వద్ద జాగ్రత్తగా వ్యవహరించాలి తెగినవైర్లు ఉంటే అధికారులకు సమాచారం అందించాలి. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ విజయ్ కుమార్ ఎస్సై సుభాష్ గౌడ్ ఐసిడిఎస్ సూపర్వైజర్ మెహతాబ్ బేగం పంచాయతీ సెక్రెటరీ రజిత ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# సభ్యత్వ నమోదుతో పార్టీ బలోపేతానికి కృషి

**- వెల్దండ మండల సింగిల్ విండో చైర్మన్ భాస్కర్ రావు**

**వెల్దండ జూన్ 04 (జనంసాక్షి):** తెలంగాణ జాతిపిత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు పిలుపు మేరకు, కల్వకుర్తి నియోజకవర్గంలో ఎస్ఐఆర్ ప్రక్రియ మరియుబీఆర్ఎస్ పార్టీ డిజిటల్ మెంబర్‌షిప్ (సభ్యత్వ, నమోదు) డ్రైవ్ కార్యక్రమంలో వెల్దండ సింగిల్ విండో చైర్మన్ జూపల్లి భాస్కర్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ డిజిటల్ సభ్యత్వ నమోదు చేయించి ప్రతి కార్యకర్త పార్టీ బలోపే దానికి కృషి చేయాలని అన్నారు. మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, మెట్టు శ్రీనివాస్ బీఆర్ఎస్ పార్టీ సెక్రెటరీ మరియు నాగర్‌కర్నూల్ ఇంచార్జ్,వేద రజని కల్వకుర్తి సభ్యత్వ నమోదు ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పుల వెంకటేష్, మాజీ జడ్పీటీసి విజితా రెడ్డిలు పాల్గొన్నారు. వెల్దండ సింగిల్



విండో చైర్మన్ జూపల్లి భాస్కర్ రావు ప్రసంగిస్తూ క్షేత్రస్థాయిలో బీఅర్ఎస్ పార్టీ సర్ ప్రక్రియ,డిజిటల్ మెంబర్షిప్ ప్రక్రియలో బూతుల వారిగా ఎంపిక చేయబడిన గులాబీ శ్రేణులు,నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యులు, మండల సమన్వయ కమిటీ సభ్యులు, అనుబంధ సంస్థలకు చెందిన వివిధ విభాగాల నాయకులు, తాజా మాజీ ప్రజా ప్రతినిధులు సర్ ప్రక్రియ, డిజిటల్ మెంబర్షిప్ ప్రక్రియ వేగంగా పూర్తి చేయాలని పిలుపునిచ్చారు.

# ఈ సింగారానికి సిఎం పర్యటన అవసరమా?

**- తెలంగాణ వాదులు, బిఆర్ఎస్ పార్టీ నేతలను, కార్యకర్తలను వెంటనే వదిలేయాలి - మాజీ మంత్రి**



**వనపర్తి రూరల్, జూన్ 04, (జనంసాక్షి):** గురువారం సిఎం పర్యటన పేరుతో అక్రమంగా నిర్బంధించిన తెలంగాణ వాదులు, బిఆర్ఎస్ పార్టీ నేతలను, కార్యకర్తలను వదిలేయాలని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఒక ప్రకటనలో విమర్శించారు. విపత్తుల సమయంలో పర్యటన చేయని నేతలు, నాయకులు ఇప్పుడెందుకు పర్యటన చేస్తున్నారు అని ప్రశ్నించారు. ఇప్పటికీ కల్లాలలో వడ్లు అలాగే ఉన్నాయి. రైతు భరోసా అడుగుతారు అనే నేపంతో సిఎం హెలికాప్టర్ పర్యటన చేస్తున్నారు, ఈ సింగారానికి సిఎం పర్యటన అవసరమా అని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మీద ప్రజలు ఆశలు కోల్పోయారు, వారు ఏదో చేస్తారు అన్న భ్రమలో కూడా తెలంగాణ ప్రజలు లేరు అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని ఎప్పుడో కోల్పోయింది, భవిష్యత్తులో వారికి పరాభవం తప్పదు అని హితవు పలికారు.

# అధికారులు అందుబాటులో ఉండి సేవలందించాలి

**- జిల్లా అడిషనల్ కలెక్టర్ నరసింగరావు**



**ఇటిక్యాల, జూన్4 (జనంసాక్షి):** గ్రామీణ ప్రాంతాల్లోని అధికారులందరూ ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ నర్సింగరావు అధికారులకు సూచించారు. గురువారం ఇటిక్యాల మండలం చాగాపురం గ్రామంలో ఏర్పాటుచేసిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతంలో పెండింగ్లో ఉన్న అభివృద్ధి పనులను పూర్తి చేయాలని, బడి బయట ఉన్న పిల్లలను బడిలో చేర్పించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆదేశించారు. అధికారులు చేపడుతున్న సమగ్ర సర్వేకు కుటుంబ సభ్యులు పూర్తి సమాచారం అందించి సహకరించాలని కోరారు. గ్రామీణ ప్రాంతాలను ప్రజలందరూ చెత్తను వేసేటప్పుడు తడి, పొడి చేతులను వేరువేరుగా వేయాలన్నారు. రైతులు పంటసాగు సమయంలో రైతులు అధికారుల సలహాలు, సూచనలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సావిత్రమ్మ, ఉప సర్పంచ్, మండల ప్రత్యేక అధికారి సునంద, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

# టిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ ముందస్తు అరెస్ట్



**నారాయణపేట జూన్ 4(జనంసాక్షి):** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నారాయణ పేట్ జిల్లా పర్యటన సందర్భంగా తెలంగాణ రక్షణ సేన పార్టీ జిల్లా అధ్యక్షులు గవినోళ్ల శ్రీనివాస్ గురువారం ఉదయమే పోలీస్‌లు ముందస్తు అరెస్ట్ చేసి దామర్ గిద్ద పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ప్రజా సమస్యలు పరిష్కారం చెయ్యాలి, ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణం చెయ్యాలి, జిల్లా సమస్యలు తీర్చాలి, జిల్లా రావాల్సిన నిధులు జిల్లాలో ఉండాల్సిన పంచాయతీ రాజ్ ఎస్సీ కార్యాలయం వికారాబాద్‌లో ఉంది. దేవాదాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కార్యాల యం మహబూబ్‌నగర్‌లో ఉంది. ఇంకా జిల్లాలో ఎస్పీ కార్యాలయం కాలేదు. రోడ్లసమస్యలు పరిష్కారం చెయ్యాలి అని అడిగితే పోలీస్ స్టేషన్‌లో ముందస్తు అరెస్ట్ చేయడం దారుణం అని శ్రీనివాస్ అన్నారు. ప్రజాసమస్యలపై నిరంతరపోరాటం తప్పదని హెచ్చరించారు.

# పేరు సింగారం.... రోడ్డు అధ్వాన్నం....!



**నారాయణపేట జూన్ 4(జనంసాక్షి):** నారాయణపేట మండలం, సింగారం చౌరస్తా నుంచి గ్రామనికి వెళ్లే రహదారి మధ్యలో పలు చోట్ల అధ్వానంగా మారింది. వాహనచోదకులు నానా అవస్థలు పడుతున్నారు. రోడ్డుపై గుంతలు పడడంతో రాత్రి వేళల్లో ఈ రోడ్డు గుండా ప్రయాణించాలంటే జంకుతున్నారు. దీనికి తోడు మధ్యలో స్పీడ్ బ్రేకర్లతో సమస్య మరింత తీవ్రం అయింది. దీంతో గురువారం సింగారం పంచాయతీ అధికారులు దిద్దుబాటు చర్యలు చేపట్టారు. గుంతలు ఏర్పడిన చోట్ల మట్టితో పూడ్చారు. మట్టితో తాత్కాలికమైన పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు. గత ఏప్రిల్ 9న ఇదే సమస్యను సింగారం పంచాయతీ పాలకవర్గం మహబూబ్‌నగర్ పార్లమెంటు సభ్యురాలు డికే అరుణ దృష్టికి తీసుకెళ్లారు.

# జడ్చర్లలో ప్రజా పాలన, ప్రగతి పాలన వార్డు సభలు

**- జడ్చర్లలో ప్రజా పాలన, ప్రగతి పాలన వార్డు సభలు**
**- పరిసరాల పరిశుభ్రతతోనే వ్యాధుల నివారణ**
**- మున్సిపల్ కమిషనర్ ఎం.గిరీష్**



**జడ్చర్ల, జూన్ 4 (జనంసాక్షి):** జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలో 'ప్రజా పాలన – ప్రగతి పాలన' 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా గురువారం వివిధ వార్డుల్లో వార్డు సభలు, అవగాహన కార్యక్రమాలు ముమ్మరంగా నిర్వహించారు. మున్సిపాలిటీ పరిధిలోని మూడో వార్డు ప్రేమ్ రంగా గార్డెన్‌లో వార్డు సభ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ కమిషనర్ ఎం. గిరీష్, మేనేజర్ లక్ష్మన్న, రెవెన్యూ ఆఫీసర్ సలాం, రెవెన్యూ ఇన్స్పెక్టర్ నాగేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కమిషనర్ గిరీష్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ స్వచ్ఛ జడ్చర్ల – స్వచ్ఛ వార్డ్ అనే నినాదంతో పనిచేసి తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పిలుపునిచ్చారు. ఇండ్లలో తడి, పొడి చెత్తను విడివిడిగా వేరుచేసి మున్సిపల్ స్వచ్ఛ ఆటోలకు అందించాలని కోరారు. రాబోయేది వర్షాకాలం కావున ఇండ్ల ఆవరణలో ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. నీటి నిల్వల్లో లార్వాలు ఏర్పడి దోమలు వృద్ధి చెందుతాయని, తద్వారా డెంగ్యూ, మలేరియా వంటి ప్రమాదకర వ్యాధులు వచ్చే అవకాశాలు ఉన్నాయని హెచ్చరించారు. వార్డు అధికారులు ఎం.అశ్విని, డి.కృష్ణయ్య, డాక్టర్ శ్వేత, ఆర్పీలు సరితా, స్వాతి, అంగన్వాడీ టీచర్లు శ్యామల, పెంటమ్మ, ఆశా వర్కర్ మంగమ్మ, అనంత కిషన్, అశోక్ రెడ్డి, అశోక్, కండి కృష్ణ, భరత్ సింహారెడ్డి, చంద్రమౌళి పాల్గొన్నారు. 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా కావేరమ్మ పేట మున్సిపల్ ఫంక్షన్ హాల్లో ఒకటో వార్డు, రెండో వార్డు ప్రజల సమస్యలపై ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా స్థానిక తాగునీటి సమస్య, విద్యుత్ సమస్యలు, ఇందిరమ్మ ఇండ్ల బిల్లుల మంజూరును పూర్తి చేయడం, తడి–పొడి చెత్తపై అవగాహన మరియు మలేరియా, డెంగ్యూ వ్యాధులు ప్రబలకుండా నిత్యం మురుగు కాలువలను శుభ్రం చేయడం వంటి పలు సమస్యలను స్థానికులు మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. సమస్యల పరిష్కారానికి సానుకూలంగా స్పందించిన కమిషనర్, తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వార్డ్ ఆఫీసర్లు ఆంజనేయులు, కృష్ణ, మాజీ కౌన్సిలర్ బుక్క మహేష్, నాయకులు చంద్రమౌళి, వెంకటేష్, పిట్టల నరేశ్, శ్రీకాంత్, రమేష్, ఏఎంసీ డైరెక్టర్ లక్ష్మణ్, మహిళా సంఘాల సభ్యులు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# చట్టసభల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్‌తో సాధికారత : ఎన్ఎఫ్ఐడబ్ల్యు



**వనపర్తి రూరల్, జూన్ 04, (జనంసాక్షి):** చట్టసభల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించడం తోనే మహిళా సాధికారత సాధ్యమని ఎన్ఎఫ్ఐడబ్ల్యు జిల్లా అధ్యక్షురాలు కృష్ణవేణి, ప్రధాన కార్యదర్శి గీత అన్నారు. గురువారం వనపర్తి జిల్లా ఆఫీసులో ఎన్ఎఫ్ఐడబ్ల్యు 72వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఎన్ఎఫ్ఐడబ్ల్యు జెండాను ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షురాలు, మాజీ సర్పంచ్ కళావతమ్మ ఆవిష్కరించారు. నేతలు మాట్లాడుతూ... జనాభాలో సగభాగం ఉన్న మహిళలకు చట్టసభల్లో కేవలం 33% రిజర్వేషన్ కు చట్టం చేశారని, బిజెపి ప్రభుత్వం నియోజకవర్గాల పునర్విభజన బిల్లుతో కలిపి పార్లమెంటులో బిల్లు పెట్టి అమలు కాకుండా అడ్డు కొట్టిందని, విడిగా మహిళా రిజర్వేషన్ బిల్లును పార్లమెంటులో పెట్టి ఆమోదించాలని డిమాండ్ చేశారు. బిజెపి విధానాలు మాటల్లో మహిళలకు అనుకూలంగా చేతల్లో వ్యతిరేకంగా ఉన్నాయని విమర్శించారు. దేశంలో రాష్ట్రంలో మహిళలు, బాలికలపై హత్యాచారాలు, హత్యలు, అకృత్యాలు, వేధింపులు నానాటికి పెరుగుతున్నాయని, చాలా తక్కువ కేసుల్లో మాత్రమే శిక్షలు పడుతుండటంతో నేరాలు పెరిగిపోతున్నాయి అని అన్నారు. మహిళలు సంఘటితమై నిందితులకు శిక్షలు పడేదాకా పోరాడాలి అన్నారు. బండి భగీరథ అధికారాన్ని అడ్డం పెట్టుకొని బాలికలపై లైంగిక దాడులకు పాల్పడితే ఎన్ఎఫ్ఐ డబ్ల్యు ఇతర పార్టీలు ప్రజా సంఘాలు పోరాటంతోనే అరెస్టు చేశారన్నారు. లింగ వివక్ష తగ్గలేదని ఆడపిల్లలను గర్భంలోనే చిదిమేస్తున్నారని వారిని పుట్టనివ్వాలి, ఎదగనివ్వాలి, చదవనివ్వాలి, మగ పిల్లలకు దీటుగా, కొన్నిసార్లు చదువు వివిధ రంగాల్లో వారి కంటే బాలికలు పై చేయి సాధిస్తున్నారన్నారు. మగపిల్లల కంటే ఆడపిల్లలే పుట్టింటికి, మెట్టినింటికి గౌరవం చేస్తున్నారన్నారు. ఆస్తుల కోసం మగ పిల్లలు తల్లిదండ్రులను వేధిస్తున్నారని ఆడపిల్లలు బాధ్యతగా తల్లిదండ్రులను పోషిస్తున్నారు. ఈ విషయం పెద్దలు గ్రహించాలన్నారు. మహిళలు వంటింటి కుందేళ్లుగా మారొద్దని అన్యాయం జరిగినప్పుడు వీధుల్లోకి వచ్చి పోరాడినప్పుడే హక్కులు దక్కుతాయని, న్యాయం జరుగుతుందన్నారు. ఎన్ ఎఫ్ ఐ డబ్ల్యూ జెండా కింద గ్రామ గ్రామాన మహిళలు ఏకమై మహిళలపై ఆకృత్యాలకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఎన్ఎఫ్ఐడబ్ల్యు జిల్లా ఇన్చార్జ్ రమేష్, ఎన్ఎఫ్ఐడబ్ల్యు జిల్లా ప్రధాన కార్యదర్శి గీత, వనపర్తిపట్టణ కో కన్వీనర్ శిరీష, నేతలు శ్రీదేవి, వెంకటమ్మ, సాయిలీల, నాగమణి, వార్డు మెంబర్ సుజాత, శాన్వి, బబ్బి, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

# పంట అవశేషాలు కాల్చొద్దు పొలంలో కలియ దున్నండి : వ్యవసాయ అధికారి డాకేశ్వర్ గౌడ్

**- పంట వ్యర్థాలను కాల్చితే జరిమానా**



**వీపనగండ్ల, జూన్ 5 (జనంసాక్షి):** వీపనగండ్ల మండల పరిధిలోని వల్లభాపురం తండాలో గురువారం మండల వ్యవసాయ అధికారి డాకేశ్వర్ గౌడ్ ఆధ్వర్యంలో పంట అవశేషాలను కాల్చకుండా వాడుకొనే పద్ధతుల గురించి గ్రామ ప్రజలతో,రైతులతో సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీడీవో శ్రీనివాసరావు, మండల వైద్యాధికారి డాకేశ్వర్ గౌడ్ మాట్లాడుతూ పంట ఆవశేషాలు కాల్చడం వలన గాలి కాలుష్యం పెరుగుతుంది అని అన్నారు నేల సారం తగ్గుతుంది,భూమిలోని సూక్ష్మజీవులు నశిస్తాయి అని, ఈ నష్టవులను భూమి సారం తగ్గి పంట దిగుబడి తగ్గుతుందని అన్నారు.పొగ కారణంగా కార్బన్ డయాక్సైడ్ హానికర వాయువులు విడుదలవుతాయని దీనివలన అనారోగ్యం పాలయ్యే అవకాశం ఉందని అన్నారు. పంట అవశేషాలను కాల్చకుండా పొలం మొత్తం కలియదున్నాలి అని సలహా ఇచ్చారు.హ్యాపీ సీడర్తో అవశేషాలను నేలలో కలపడం, పశువుల మేతగా వినియోగించడం,కంపోస్టు ఎరువు తయారీకి ఉపయోగించడం వలన రైతుల పెట్టుబడి తగ్గుతుందని అన్నారు.భూమి సారవంతతత పెంపు అధిక దిగుబడి పొందవచ్చు పంట అవశేషాలు నిప్పు పెడితే జరిమానా 5000 to 25000 వరకు జరిమానా విధిస్తారని తెలిపారు.

# పెబ్బేరులో అండర్-14 క్రికెట్ టోర్నమెంట్



పెబ్బేరు జూన్ 4 (జనంసాక్షి): వనపర్తి జిల్లా పెబ్బేరు పట్టణంలో మహబూబ్‌నగర్ క్రికెటర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్–14 క్రికెట్ టోర్నమెంట్ ఘనంగా ప్రారంభమైంది. ఈ టోర్నమెంట్‌కు టీ–షర్టులను స్పాన్సర్ చేసిన డాక్టర్ భరత్ కూమార్ రెడ్డి కు నిర్వాహకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. టోర్నమెంట్ ప్రారంభ కార్యక్రమానికి స్థానిక మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీనివాస్ గౌడ్, పట్టణ బీఆర్ఎస్ నాయకులు ఎద్దుల సాయినాథ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు దయాకర్ రెడ్డి, శేఖర్ రెడ్డి, బెక్కెం సర్పంచ్ ధరసింగ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అండర్–14 క్రీడాకారులను అభినందించి వారికి శుభాకాంక్షలు తెలిపారు. టోర్నమెంట్‌లో భాగంగా జరిగిన తొలి మ్యాచ్‌లో టాస్ గెలిచిన పెబ్బేరు అండర్–14 జట్టు ముందుగా బ్యాటింగ్ ఎంచుకొని నిర్ణీత ఓవర్లలో 138 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. జట్టు బ్యాట్స్‌మన్ సూరజ్ అర్ధశతకం సాధిస్తూ 50 పరుగులతో ఆకట్టుకున్నాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన మహబూబ్‌నగర్ అండర్–14 జట్టు 13 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించి విజయాన్ని సొంతం చేసుకుంది. మ్యాచ్‌లో ఇరు జట్ల క్రీడాకారులు ప్రతిభ కనబర్చగా, ప్రేక్షకులు ఉత్సాహంగా వీక్షించారు. నిర్వాహకులు అతిథులకు, క్రీడాకారులకు మరియు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

# సీఎంకు వినతి పత్రం ఇచ్చేందుకు ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి సహకరించాలి



**జడ్చర్ల, జూన్ 4 (జనంసాక్షి):** నేడు జడ్చర్ల పట్టణానికి రానున్న తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి వినతిపత్రం అందజేసేందుకు స్థానిక ఎమ్మెల్యే జనుంపల్లి అనిరుద్ రెడ్డి సహకరించాలని జడ్చర్ల రెవెన్యూ డివిజన్ సాధన సమితి కో ఆర్డినేటర్లు డాక్టర్ వడ్త్యావత్ రమేష్ నాయక్, బూర్గుపల్లి కృష్ణ యాదవ్ విజ్ఞప్తి చేశారు. గురువారం మండల విద్యా వనరుల కేంద్రంలో నిర్వహించిన ముఖ్యనాయకుల సమావేశంలో వారు మాట్లాడారు. వ్యాపార, పారిశ్రామిక మరియు పరిపాలన పరంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న జడ్చర్లకు ఇప్పటికీ రెవెన్యూ డివిజన్ హోదా లేకపోవడం వల్ల ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. జడ్చర్లను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేస్తే పరిపాలన ప్రజలకు మరింత చేరువవుతుందని, ప్రాంతీయ అభివృద్ధికి కొత్త ఊపు వస్తుందని తెలిపారు. ప్రజల ఎన్నో ఏళ్ల ఆకాంక్షను గౌరవిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే సానుకూల నిర్ణయం తీసుకోవాలని కోరారు. సీఎంను కలిసి వినతిపత్రం ఇచ్చేలా ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఫకీర్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఫకీర్ జహంగీర్ పాషా, బీజేపీ జిల్లా నాయకులు రమేష్, బీసీ జాగృతి సేన మండల అధ్యక్షులు గొడుగు నర్సిములు, ధర్మసమాజ్ పార్టీ నియోజకవర్గం అధ్యక్షుడు రంగయ్య మహారాజ్, పెద్ద అదిరాల నరసింహులు కురుమ తదితరులు పాల్గొన్నారు.

# సీఎం సభను విజయవంతం చేయాలి

**- కాంగ్రెస్ పార్టీ నాయకులు విజయ్ కుమార్**



**మిడ్జిల్, జూన్ 4 (జనంసాక్షి):** జడ్చర్ల పట్టణంలో నియోజకవర్గం అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సభను విజయవంతం చేయడానికి గ్రామ అధికారులు, మహిళా సంఘ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు విజయ కుమార్ అన్నారు. గురువారం మండలంలోని వాడ్యాల్ గ్రామంలో సర్పంచ్ చంద్రయ్య గౌడ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన గ్రామ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. మిడ్జిల్ మండలంలో అన్ని గ్రామాలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేయడానికి ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభకు గ్రామం నుంచి రాజకీయల కతీతంగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమాలు ఉప సర్పంచ్ నాగరాజ్, పంచాయతీ కార్యదర్శి ఆంజనేయులు, అంగన్వా టీచర్ మహిమూద, హెల్త్ అసిస్టెంట్ దేవయ్య, వార్డ్ మెంబర్లు మల్లేష్, ఉదయ్ కుమార్, మహిళా సంఘ సభ్యులు ఆశా వర్కర్ నర్మదా, గ్రామస్తులు భీమయ్య, తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి పర్యటనకు పటిష్ట బందోబస్తు

**- జిల్లా ఎస్పీ డి.జానకి**
**- 1406 మంది పోలీసు అధికారులు, సిబ్బందితో విస్తృత బందోబస్తు ఏర్పాటు**



**జడ్చర్ల, జూన్ 4 (జనంసాక్షి):** రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి శుక్రవారం మహబూబ్‌నగర్ జిల్లా పర్యటన సందర్భంగా జిల్లా పోలీసు శాఖ అత్యంత పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లను చేపట్టింది. ముఖ్యమంత్రి పర్యటించనున్న కార్యక్రమాలకు సంబంధించి జిల్లా పోలీసుశాఖ చేసిన భద్రతా ఏర్పాట్లను గురువారం జిల్లా ఎస్పీ డి.జానకి క్షేత్రస్థాయిలో స్వయంగా పరిశీలించారు.
ఈ పర్యటనలో భాగంగా ఎస్పీ కరువేనా రిజర్వాయర్, వుదండపూర్ రిజర్వాయర్ ప్రాంతాలను సందర్శించడంతో పాటు, జడ్చర్ల పట్టణంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభా ప్రాంగణాన్ని, హెలిప్యాడ్ ప్రాంతాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. భద్రతా పరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అక్కడికక్కడే పోలీసు అధికారులకు, సిబ్బందికి పలు కీలక సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. అనంతరం జడ్చర్లలోని ఏఎస్ఆర్ గార్డెన్ నందు పోలీసు అధికారులతో నిర్వహించిన ప్రత్యేక బ్రీఫింగ్ కార్యక్రమంలో ఎస్పీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ముఖ్యమంత్రి పర్యటన ప్రారంభం నుండి ముగిసే వరకు విధుల్లో ఉన్న అధికారులు, సిబ్బంది ప్రతిఒక్కరూ పూర్తి అప్రమత్తతతో వ్యవహరించాలని సూచించారు. భద్రతా ప్రమాణాలను కచ్చితంగా అమలుచేయాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అన్ని విభాగాల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. భద్రతా చర్యల్లో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా, ప్రతిఒక్కరూ అత్యంత బాధ్యతాయుతంగా తమ విధులను నిర్వర్తించాలని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతంగా నిర్వహించేందుకు గాను జిల్లా వ్యాప్తంగా మొత్తం 1406 మంది పోలీసు అధికారులు, సిబ్బందితో విస్తృతమైన బందోబస్తు ఏర్పాటుచేసినట్లు ఎస్పీ వెల్లడించారు. శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా అవసరమైన అన్ని రకాల ముందస్తు ఏర్పాట్లు పూర్తిచేశామని తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ బాలకోటి, ఏఆర్ అదనపు ఎస్పీ సురేష్ కుమార్, డీఎస్పీ వెంకటేశ్వర్లు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మండల కేంద్రంలో ఘనంగా ప్రత్యేక గ్రామసభ

**- హాజరైన సంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ పాండు**



**చౌట్కూర్, జూన్ 04 (జనంసాక్షి):** 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా సంగారెడ్డి జిల్లా చౌటకూర్ మండల కేంద్రంలో ప్రత్యేక గ్రామసభను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సభకు సంగారెడ్డి జిల్లా లోకల్ బాడీస్ అడిషనల్ కలెక్టర్ శ్రీ పాండు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్రామాభివృద్ధి, పారిశుధ్యం, ప్రజారోగ్యంపై ఆయన అధికారులకు, గ్రామస్తులకు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ పాండు మాట్లాడుతూ సంక్షేమ పథకాల అవగాహన పరిసరాల పరిశుభ్రత పర్యావరణ పరిరక్షణ స్థానిక సమస్యల పరిష్కారం పరిశుభ్రమైన గ్రామాల నిర్మాణానికి ప్రజల సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు. గ్రామంలో ఎక్కడా చెత్త పేరుకుపోకుండా ప్రతిఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి పారిశుధ్య నిర్వహణకు సహకరించాలని కోరారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారానే సీజనల్ వ్యాధుల వ్యాప్తిని అరికట్టవచ్చని స్పష్టం చేశారు. గ్రామంలో నీరు నిల్వ ఉండే ప్రాంతాలను గుర్తించి వెంటనే పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకురావాలి. దోమల వ్యాప్తి నివారణకు పరిశుభ్రతే ప్రధాన ఆయుధం. ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రజల భాగస్వామ్యం అత్యంత ముఖ్యం అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి వసంత కుమార్, ఎంపీడీవో కె. శంకర్, గ్రామ సర్పంచ్ రామ్ రెడ్డి, ఎంఈఓ అనురాధ, ఏపీఓ రామ్మోహన్, పంచాయతీ కార్యదర్శి సందీప్, ఫీల్డ్ అసిస్టెంట్ అనురాధ, వైద్యాధికారులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, గ్రామ ప్రజలు మరియు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.


# ప్రజల సమస్యల పరిష్కారానికే ప్రజా పాలన ప్రగతి-ప్రణాళిక

**- ఉర్కొండ ఎంపీడీవో సత్యపాల్ రెడ్డి**



**ఉర్కొండ జూన్ 04, (జనంసాక్షి);** ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రజా పాలన ప్రగతి ప్రణాళక. గ్రామసభ కార్యక్రమం నిర్వహిస్తుందని ఉర్కొండ ఎంపీడీవో సత్యపాల్ రెడ్డి అన్నారు. మండలంలోని జకినాలపల్లి, ఇప్ప పహాడ్, నర్సంపల్లి, గుండ్ల గుంటపల్లి గ్రామలలో గురువారం రోజు ఆయా గ్రామాల సర్పంచుల అధ్యక్షతన గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో గ్రామంలో ప్రగతి ప్రాణాలిక కోసం గ్రామస్థాయి సమస్యలను గుర్తించడం వాటి పరిష్కారులపై చర్చించడం జరిగింది. పారిశుద్ధ్యం పరిష్కార విజయాలను ప్రదర్శించడం జరిగింది.ముందస్తుగా వర్షాకాలం సందర్భంగా తీసుకోవలసిన జాగ్రత్తల గురించి చర్చించిడం జరిగింది. వర్షాకాలం ముందస్తు ప్రాణాలికల చేపట్టాలని తెలియజేయడం జరిగింది. మండలానికి చెందిన వివిధశాఖల అధికారులు తాము చేపట్టిన కార్యక్రమాలు తీసుకోవాల్సిన చర్యలకు అనుగుణంగా అందరూ సహకరించాలని తెలియజేశారు. కొత్త ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికను పారదర్శకంగా గ్రామసభల ద్వారానే చేయాలని అధికారులు స్పష్టం చేశారు. వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో తక్కువ వర్షపాతం ఉంటే ప్రత్యామ్నాయ పంటల (క్రాప్ డైవర్షన్) వైపు రైతులను ప్రోత్సహించడంపై వ్యవసాయ శాఖ అవగాహన కల్పిస్తోంది .రాబోయే వానాకాలం కోసం లోతట్టు ప్రాంతాల గుర్తింపు, సీజనల్ వ్యాధులు రాకుండా శానిటేషన్ పనులు, పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమాల ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ప్రజా సమస్యల పరిష్కారం, మరియు అభివృద్ధి కార్యక్రమాలను నేరుగా ప్రజల వద్దకు తీసుకెళ్లడం లక్ష్యంగా పెట్టుకున్నారనీ తెలియజేశారు.
ఈ కార్యక్రమంలో ఆయా గ్రామల సర్పంచ్ లు శేఖర్ యాదవ్,సునీత రెడ్డి , మండల ఎంపీడీవో సత్యపాల్ రెడ్డి, మండల ఎం పి ఓ లక్ష్మణ్ నాయక్. విద్యుత్ శాఖ ఏఈ సాయన్న గౌడు, పంచాయతీ శాఖ ఏ ఈ మహేందర్, ఆర్డబ్ల్యూఎస్ ఆర్డబ్ల్యూఎస్ ఏఈ లలిత, ఎంపీ ఓ నరసింహ, హౌసింగ్ ఏఈ కిరణ్, ఏఈఓ హర్షయా, రెవెన్యూ జూనియర్ అసిస్టెంట్ అఖిలేష్ గౌడ్ గారు పంచాయతీ కార్యదర్శిముస్తఫా ,సురేష్ గౌడ్ జిపిఓలు సునీత, నాగరాజు ఏఎన్ఎం ఊర్మిళా, ఉప సర్పంచ్‌లు పోలే రాజశేఖర్, దుబ్బ భాగ్యరాణి శివ, వార్డు మెంబర్స్, మహిళా సంఘం సభ్యులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొనడం జరిగింది.

# ఈనెల 10న నాగర్‌కర్నూలులో ఉచిత కంటి చికిత్స శిబిరం



**నాగర్ కర్నూల్, జూన్ 4 (జనంసాక్షి):** జిల్లా అందత్వ నియంత్రణ సంస్థ ఆధ్వర్యం లో నాగర్ కర్నూలు జిల్లా కేంద్రంలోని రాంనగర్ కాలనీ, రామకృష్ణ టాకీస్ రోడ్డులో గల శోభ ఆప్టికల్‌లో ఈనెల 10న బుధవారం నాడు ఉదయం 9గంటలకు ఉచిత కంటి చికిత్స శిబిరం నిర్వహిస్తున్నట్లు విశ్రాంత ఆప్తాలమిక్ ఆఫీసర్ బి.శివారెడ్డి తెలిపారు. ఈ శిబిరంలో రోగులకు కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి, క్యాటరాక్ట్ పోరగల వారినీ ప్రత్యేక అంబులెన్స్ ద్వారా లయన్ రాంరెడ్డి కంటి ఆసుపత్రి, ఎనుగొండ, మహబూబ్ నగర్ కి పంపించి ఉచితంగా ఆపరేషన్లు నిర్వహించనునట్లు తెలిపారు. రోగులకు ప్రభుత్వ ఆస్పత్రిలో ఉచితంగా రక్తపరీక్షలు, సాధారణ పరీక్షలు, ప్రతిరోజు నిర్వహిస్తారని తెలిపారు. శిబిరానికి వచ్చే ముందు ఆధార్ కార్డు, ఓటర్ కార్డ్, లేదా రేషన్ కార్డ్ జిరాక్స్ కాపీని వెంట తెచ్చుకోవాలని సూచించారు.మరిన్ని వివరాల కు 9440454284, 8106333324 నెంబర్ లలో సంప్రదించాలని కోరారు.

# ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

**- సర్పంచ్ ఇమ్మడి సైదులు**
**- మహాదేవపూర్ గ్రామంలో ప్రజా పాలన గ్రామ సభ నిర్వహణ**



**అచ్చంపేట, జూన్ 4 (జనంసాక్షి):** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా మహాదేవపూర్ గ్రామంలో ఘనంగా గ్రామసభ సర్పంచ్ ఇమ్మడి సైదులు అధ్యక్షతన ఘనంగా నిర్వహించరూ ఈ సందర్భంగా సర్పంచ్ ఇమ్మడి సైదులు మాట్లాడుతూ గ్రామ సభలో గ్రామ అభివృద్ధి, ప్రజల సంక్షేమం ప్రధాన అజెండాగా పలు ముఖ్య అంశాలపై చర్చించడం ప్రజల సమస్యలు వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని నిర్ణయించడం జరిగింది.
ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలలో గ్రామ లబ్ధిదారుల శాతాన్ని వివరించి,ప్రభుత్వం తీసుకుంటున్న ప్రతి నిర్ణయం ప్రజల మేలు కోసమేనని స్పష్టం చేశారు.గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను కూడా ప్రజలకు వివరించడం జరిగింది అని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో, ఎంపీవో, మండలస్థాయి వివిధ శాఖల అధికారులు గ్రామ పంచాయతీ కార్యదర్శి,ఉప సర్పంచ్, గ్రామ పెద్దలు ,వార్డు సభ్యులు అంగన్వాడీ సిబ్బంది,ఆశ వర్కర్స్, ఉపాధ్యాయులు,ఆరోగ్య విద్యుత్ శాఖ సిబ్బంది,యువకులు మరియు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు

# గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా పనిచేయాలి

**- మండల ప్రత్యేక అధికారి వెంకటేశ్వర్లు**

**మిడ్జిల్, జూన్ 4 (జనంసాక్షి):** గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా సర్పంచులు, ఉపసర్పంచులు వార్డు మెంబర్లు, మండల శాఖ అధికారులు పనిచేయాలని మండల ప్రత్యేక అధికారి వెంకటేశ్వర్లు చెప్పారు. గురువారం మండల కేంద్రంతోపాటు, వెలుగొమ్ముల, అయ్యవారిపల్లి, వ స్పల, వాడ్యాల్, వేముల, గ్రామాలలో సర్పంచులు ఎడ్ల శంకర్ ముదిరాజ్, సువర్ణమ్మ, రాములమ్మ, చంద్రయ్య గౌడ్, నాగమ్మ ఆంజనేయులు అధ్యక్షతన ఏర్పాటుచేసిన గ్రామసభలలో ఆయా గ్రామాల ప్రత్యేక అధికారులు పాల్గొని మాట్లాడారు. గ్రామంలో ఉన్న సమస్యలను గుర్తించి పరిష్కరించే విధంగా సర్పంచులు కృషి చేయాలని పేర్కొన్నారు. నకిలీ విత్తనాలు అమితే సర్పంచ్లు, రైతులు అధికారులకు సమాచారాన్ని అందించాలని, సేంద్రీయ ఎరువుల వాడాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల తహసిల్దార్ రాఘువేందర్ రెడ్డి, ఎంపీడీవో గీతాంజలి, ఎంపీ ఓ రాజశేఖర్ రెడ్డి, వ్యవసాయ అధికారి సిద్ధార్థ, సూపర్డెంట్ ఆనంద్, ఆయా గ్రామ ఉపసర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు గ్రామస్తులు మహిళా సంఘ సభ్యులు మండల శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పెన్షనర్ల సంఘం మండల అధ్యక్షునికి సన్మానం



**కొల్చారం, జూన్ 4,(జనంసాక్షి):** రిటైర్డ్ పెన్షనర్ల సంఘం మండల అధ్యక్షుడు సంజీవ్ రావు జన్మదినం సందర్భంగా గురువారం మిత్రబృందం శాలువాలతో ఘనంగా సన్మానించింది. మండల కేంద్రం కొల్చారంకు చెందిన బేగరి సంజీవ్ రావు ప్రతి ఒక్కరితో చిన్న పెద్ద తార తమ్యం లేకుండా కలుపుగోలుగా ఉండే వ్యక్తి కనుక అందరు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘమేశ్వర్, రాజిరెడ్డి, నాగేందర్, నర్సప్ప, చిన్న రాములు, చెన్నయ్య, సొసైటీ చైర్మన్ మనోహర్,గ్యాస్ కృష్ణ, అశోక్ గౌడ్, రామకృష్ణ గౌడ్, అశోక్, సిద్దిరాములు, లక్ష్మి నారాయణ గౌడ్, శ్రీధర్, శేఖర్, యాదగిరి, శ్రీనివాస్, నజీర్, భాస్కర్, నాగరాజు,భూపాల్, వంశీ, అందనగరం ఏసురత్నం, అనంతరాజ్ తదితరులు ఉన్నారు.

## మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి హౌజ్ అరెస్ట్



**మక్తల్, జూన్ 4 (జనంసాక్షి):** నారాయణ పేట జిల్లా మక్తల్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన నేపథ్యంలో ముందస్తుగా మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి సహా పలువురు బిఆర్ఎస్ నాయకులను పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. స్థానిక సీఐ రామ్‌లాల్ ఎస్సైలు వెంకటేశ్వర్లు ,వై. భాగ్య లక్ష్మి రెడ్డిల ఆధ్వర్యంలో పోలీసులు చిట్టెం రామ్మోహన్ రెడ్డితో పాటు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పి.నర్సింహా గౌడ్ ,బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు చిన్న హనుమంతు, నాయకులు శివారెడ్డి, బండారి ఆనంద్,ఎడివెల్లి బాలప్ప తదితరులను అరెస్టు చేసి గృహ నిర్బంధం చేశారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో మక్తల్ నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకం పనుల్లో భాగంగా పైప్ లైన్ ద్వారా నీటిని తరలించడం కన్నా గ్రావిటీ కెనాల్ ద్వారా నీటిని తీసుకెళ్లాలనే డిమాండ్ తో మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో బిఆర్ఎస్ శ్రేణులు ముఖ్యమంత్రి పర్యటన అడ్డుకుని ఆందోళన చేస్తారన్న ముందస్తు సమాచారంతో గృహనిర్బంధం చేసినట్లు పోలీసులు తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ప్రతిపక్ష నాయకులను అరెస్టు చేస్తే తప్ప ఆయా ప్రాంతాల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాళ్లు పెట్టేందుకు భయపడడం చూస్తుంటే బాదేస్తోందని మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ముందస్తు అరెస్టులు గృహనిర్బంధాలతో ప్రజా సమస్యలను విస్మరించలేరని ఆందోళనలను అడ్డుకోలేరని అన్నారు. గ్రావిటీ కెనాల్ ద్వారా కొడంగల్ కు నీటిని తీసుకు వెళ్లడం వల్ల ఈ ప్రాంత ప్రజలకు లాభం చేకూరుతుంది తప్ప పైపుల ద్వారా తీసుకెళ్లడం వల్ల ఇక్కడి రైతులకు ఎలాంటి ప్రయోజనం లేదని అన్నారు. మక్తల్ నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల ద్వారా మక్తల్ నియోజకవర్గం లోని ఊట్కూరు తదితర ప్రాంతాల్లో కేవలం 17 ఎకరాలకు మాత్రమే సాగునీరు అందే అవకాశం ఉందన్నారు. అదే పాలమూరు రంగారెడ్డి నుండి కొడంగల్ కు నీటిని తరలిస్తే 66 వేల పై చిలుకు ఎకరాలకు సాగునీరిందే అవకాశమున్నప్పటికీ వ్యక్తిగత స్వార్థం రాజకీయ కక్షతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భూత్పూర్ రిజర్వాయర్ ద్వారా నీటిని తరలించుకుపోతున్నారని మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి అన్నారు .పోలీసులను అడ్డం పెట్టుకొని అక్రమంగా గృహ నిర్బంధం చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు .ప్రతిపక్ష నాయకులను పోలీసులతో అడ్డుకునే కన్నా సమస్యల పరిష్కారం పై ముఖ్యమంత్రి దృష్టి సారించాలని మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి కి హితవు పలికారు.

## సిఎం పర్యటన పట్ల కృష్ణ మండల కాంగ్రెస్ నాయకుల హర్షం



**కృష్ణ, జూన్ 4 (జనంసాక్షి):** భీమా కృష్ణ నది పై బ్రిడ్జి కమ్ బ్యారేజ్ నిర్మాణం ఏరియల్ సర్వే కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి వాకిటి శ్రీహరి పర్యటన చేయడం పట్ల కృష్ణ మండల కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి నారాయపేట ను, సస్యాసమాలం చేసే దిశగా కృష్ణ మండల కేంద్రంలోని సరిహద్దునున్న కుసుమూర్తి, తంగిడి, గ్రామాల మధ్య భీమా నదిపై బ్రిడ్జ కం బ్యారేజీ నిర్మించాలని ప్రతిపాదనపై గురువారం హెలికాప్టర్ ద్వారా ఏరియల్ సర్వే నిర్వహించడం జరిగిం ది.అందులో భాగంగా హర్షం వ్యక్తం చేస్తూ, మండలం కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, పెద్ద ఎత్తున తరలి జాతీయ జెండాలను ఊపుతూ తమ మద్దతును తెలిపారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ అధ్యక్షులు రాజప్ప గౌడ, యువజన కాంగ్రెస్ అధ్యక్షులు షేక్ సర్ఫరాజ్, కృష్ణ సర్పంచ్ నాగేంద్ర, మక్తల్ మార్కెట్ డైరెక్టర్ తంగిడి నాగరాజ్, నాయకులు పల్లె సురేష్, గుడేబల్లూర్ సోమ సంతోష, వివిధ గ్రామాల సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు యువకులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు చేయాలంటూ రోడ్డెక్కిన రైతులు

**- రహదారిపై బైఠాయించి ధర్నా రస్తారోకో**



**హత్నూర, జూన్ 4 (జనంసాక్షి):** పదిమందికి అన్నం పెట్టే రైతన్న అన్నమో రామచంద్ర అంటూ గుండెలు బాదుకుంటున్నాడు.పుట్టెడు బాధను కడుపులో దాచుకుని బిక్కుబిక్కుమంటూ దిక్కులు చూస్తున్నారు. తాము పండించిన పంట ఇంకా కళ్ళాల్లోనే మూలుగుతుండటం చూసి ఆ రైతు కళ్ళల్లో కన్నీటి సుడులు తిరుగుతున్నాయి.పాలకులు చెప్పినా, అధికారులు వచ్చినా ధాన్యం కుప్పలు మాత్రం కల్లాల్లో నుంచి కదలక పోవడంతో రైతుల ఆగ్రహం కట్టలు తెంచుకుని కదం తొక్కింది.పాలకుల వైఫల్యం, అధికారుల నిర్లక్ష్యాన్ని ఎండగడుతూ మూకుమ్మడిగా రోడ్డుపై బైఠాయించి ధర్నా రస్తారోకో నిర్వహించారు.ఈ సంఘటన హత్నూర మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం చోటుచేసుకుంది.జోగిపేట- హత్నూర ప్రధాన రహదారిపై బైఠాయించి ఆందోళనకు దిగారు.వర్షాలకు ధాన్యం తడిసి మొలకెత్తినా అధికారుల్లో చలనం లేదని వారు మండిపడ్డారు.పాలకులు ఆదేశించడం అధికారులు సందర్శించడం తప్పా కొనుగోలు ప్రక్రియలో ఏ మాత్రం వేగం కనిపించడం లేదని వారు వాపోయారు.ఖరీఫ్ పంట సాగుకు దుక్కి దున్ని,నారు పోయాల్సిన రైతులు రోడ్లమీద బైఠాయించి రోదించే పరిస్థితి దాపురించిందని వారన్నారు.

# ఉదండాపూర్ నిర్వాసితులకు ప్రభుత్వం అండ

- ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి
- నేడు జడ్చర్లకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాక
- భూ నిర్వాసితులకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ నిధులు పూర్తిస్థాయిలో చెల్లిస్తాం
- సీఎం రేవంత్ రెడ్డి ఉదండాపూర్ ప్రాజెక్టు పరిశీలన
- అనంతరం జడ్చర్లలో భారీ బహిరంగ సభ
- సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పిలుపు




**జడ్చర్ల, జూన్ 4 (జనంసాక్షి):** ఉదండాపూర్ రిజర్వాయర్ నిర్మాణంలో భూములు కోల్పోయిన నిర్వాసితుల సంక్షేమం పట్ల రాష్ట్ర ప్రభుత్వం పూర్తి బాధ్యతతో వ్యవహరిస్తోందని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి స్పష్టం చేశారు. నేడు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఉదండాపూర్ ప్రాజెక్టు పరిశీలనకు వస్తున్నారని, ప్రాజెక్టు సందర్శన, ఉన్నత స్థాయి సమీక్ష అనంతరం ముఖ్యమంత్రి జడ్చర్ల పట్టణంలో నిర్వహించే భారీ బహిరంగ సభలో పాల్గొంటారని ఎమ్మెల్యే తెలిపారు. జడ్చర్ల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తో కలిసి ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి మాట్లాడుతూ ఉదండాపూర్ భూ నిర్వాసితులకు ప్రకటించిన ఆర్అండ్ఆర్ ప్యాకేజీకి సంబంధించిన నిధులను పూర్తిస్థాయిలో చెల్లిస్తామని హామీ ఇచ్చారు. నిర్వాసితులను గౌరవ ప్రదంగా పునరావాస ప్రాంతాలకు తరలించి, వారికి అవసరమైన అన్ని మౌలిక వసతులు, సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేడు మధ్యాహ్నం నేరుగా ఉదండాపూర్ ప్రాజెక్ట్ దగ్గరికి చేరుకొని, అక్కడ జరుగుతున్న పనులను స్వయంగా పరిశీలిస్తారని, ప్రాజెక్టు పరిశీలన ముగిసిన అనంతరం సీఎం నేరుగా జడ్చర్ల పట్టణంలో నిర్వహించే భారీ బహిరంగ సభకు రానున్నారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి ఎల్లప్పుడూ ఉదండాపూర్ నిర్వాసితులకు అండగా ఉంటారని, వారి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని తెలిపారు. ఉదండాపూర్ ప్రాజెక్టును త్వరగా పూర్తి చేసి ఈ ప్రాంత ప్రజల ఆశయాలను నెరవేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం వేగంగా ముందుకు సాగుతోందని, సీఎం నాయకత్వంలో భూ నిర్వాసితుల కళ్లల్లో ఆనందం నింపే నిర్ణయాలు తీసుకుంటున్నామని అన్నారు. నేడు నిర్వహించే బహిరంగ సభలో జడ్చర్ల అభివృద్ధి, భవిష్యత్ ప్రణాళికలు, ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించిన కీలక సందేశాలు వెలువడనున్నాయని వెల్లడించారు. ముఖ్య మంత్రి జడ్చర్ల పర్యటనను పురస్కరించుకుని ఉమ్మడి జిల్లా, నియోజకవర్గంలోని అన్ని మండలాల ప్రజలు, రైతులు, మహిళలు, యువజనులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి బహిరంగ సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్యక్రమంలో పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు యాదయ్య, అశోక్ కుమార్ యాదవ్, శివకుమార్, పిఏసిఎస్ చైర్మన్ సుదర్శన్ గౌడ్, రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

## పరీక్షల్లో ఫెయిలవుతానన్న బెంగతో ప్రాణం తీసుకున్న యువకుడు

**- చెట్టుకు ఉరి వేసుకొని యువకుడు ఆత్మహత్య**

**చేర్యాల, జూన్ 04 (జనంసాక్షి):** చేర్యాల పట్టణ పరిధిలోని గడితోటకు చెందిన పిట్టల గణేష్ (20) పరీక్షల్లో ఫెయిల్ అవుతానన్న బెంగతో ఆత్మహత్య చేసుకున్న సంఘటన చేర్యాల మండల కేంద్రంలో గురువారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చేర్యాల ఎస్సై గూడ అపూర్వరెడ్డి తెలిపారు. పట్టణం లోని గడి తోటకు చెందిన పిట్టల మంజుల చిన్న కుమారుడు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. గత కొద్ది రోజుల క్రితం నిర్వహించిన పరీక్షల్లో నాలుగు సబ్జెక్టులు ఫెయిల్ అయ్యాడు. ప్రస్తుతం సప్లమెంటరీ పరీక్షలు రాస్తున్న క్రమంలో ఈ పరీక్షలు కూడా సరిగ్గా రాయడం లేదని మళ్లీ ఫెయిల్ అవుతానని బెంగ పెట్టుకొని ఇంట్లో చెప్పి బాధపడు తుండేవాడు. పరీక్ష రాస్తా అని ఇంట్లో నుంచి వెళ్లి తన వ్యవసాయ బావి వద్ద చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గణేష్ చనిపోతూ సెల్ఫీ వీడియో తీసుకుంటూ అమ్మ నేను చనిపోతున్నాను నీవు అన్న అందరూ మంచిగా ఉండండి అని నేను కావాలనే చనిపోతున్నానని తెలిపినట్లు పేర్కొన్నారు. మృతుడి తండ్రి కృష్ణ 13 సంవత్సరాల క్రిత మే మృతి చెందాడు. మృదుదేహాన్ని పంచ నామా నిమిత్తం మార్చురుకి తరలించి కేసు



నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

# పర్యావరణ పరిరక్షణ సామాజిక బాధ్యత

**- ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ అనురాధ**



**నాగల్గిద్ద జూన్ 04 (జనంసాక్షి):** ప్రస్తుత వేసవిలో ఉష్ణోగ్రతలు పెరిగి మనమందరం మానసికంగా శారీరకంగా చాలా ఇబ్బందులు పడ్డామని, ఇలాంటి ఇబ్బందులే వన్యప్రాణులకు కూడా ఉంటాయని, సమస్త ప్రాణికోటి పరిరక్షణనే ధ్యేయంగా పర్యావరణం కోసం మనమందరం చెట్లు నాటాలని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ అనురాధ అన్నారు. గురువారం నాడు జడ్పిహెచ్ఎస్



నారాయణఖేడ్‌లో ప్రజాపాలన, ప్రగతి ప్రణాళికలో భాగంగా పర్యావరణ పరిరక్షణ పట్ల పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే ప్రతి ఒక్కరూ పర్యావరణం పట్ల అవగాహన కలిగి ఉండి చెట్ల పెంపకం కోసం కృషి చేయాలి అన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం మన్మద్ కిషోర్, ఉపాధ్యాయులు యాదగిరి, చంద్రశేఖర్ ఆచార్య, దేవ్ సింగ్ ,గురునాథ్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ లు కృష్ణ గౌడ్, సంజీవ్,వనజ తదితరులు పాల్గొన్నారు.